క్లుప్తంగా

రోప్ స్కిప్పింగ్‌లో ప్రతిభ

ఆస్పరి: ఆస్పరిలోని సద్గురు ప్రైవేట్ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న హర్షిత అనే విద్యార్థిని రోప్ స్కిప్పింగ్‌లో రెండవ స్థానంలో నిలిచినట్లు ప్రధానోపాధ్యాయుడు బసవరాజు సోమవారం తెలిపారు. ఈనెల 29వ తేదీన కర్నూలులో అండర్ –10 విభాగంలో రాష్ట్ర స్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో హర్షిత రెండవ స్థానంలో నిలిచి ప్రశంసా పత్రం అందుకుంది.ఈ సందర్భంగా విద్యార్థిని హర్షితను గ్రామస్తులు అభినందించారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలి

ఎమ్మిగనూరుటౌన్: విశాఖ ఉక్కు పరిశ్రమను కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ చేసే ప్రయత్నాన్ని విరమించుకోవాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి ఏసేపు, రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి చిన్ని ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సోమవారం స్థానిక రెవిన్యూ కార్యాలయంలో తహసీల్దార్ ఆంజనేయులుకు వినతిపత్రం ఇచ్చి మాట్లాడారు. ఏపీ రాష్ట్ర విభజన సమయంలో కేంద్రం ఇచ్చిన హామీలో భాగంగా రాష్ట్రానికి ప్రత్యేక హోదా, ప్యాకేజీ, విశాఖ రైల్వే జోన్‌లను వెంటనే మంజూరు చేయాలన్నారు. ఆయా సంఘాల నాయకులు రవి తదితరులు పాల్గొన్నారు.

మౌలాలి స్వామి పీర్ల ఊరేగింపు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని పెద్ద కటిక వీధి, గంగన్న మసీదు ప్రాంతాల్లోని పీర్ల చావిడిల వద్ద మౌలాలి పీర్లను సోమవారం భక్తిశ్రద్ధలతో ఊరేగింపు నిర్వహించారు. భక్తులుమొక్కుబడులు తీర్చుకున్నారు. యువకులు కర్ర సాము, కాడి తిప్పడం, రాతి గుండ్లు ఎత్తడం లాంటి విన్యాసాలతో ఆకట్టుకున్నారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులతో నేడు సమావేశం

పత్తికొండటౌన్: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నియోజకవర్గ ఓటర్ల జాబితాకు సంబంధించి ఆగస్టు నెల 1వ తేదీ మంగళవారం పత్తికొండ తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించనున్నట్లు సహాయ ఓటర్ల నమోదు అధికారి విష్ణుప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఓటర్ల జాబితా, ఇంటింటి సర్వే కార్యక్రమం అమలు గురించి చర్చిస్తారన్నారు. సమావేశానికి నియోజకవర్గంలోని ఐదు మండలాల తహసీల్దార్లు, అన్ని రాజకీయ పార్టీల నాయకులుహాజరు కావాలని ఆయన కోరారు.

భక్తిశ్రద్ధలతో జాల్దార్ పున్నమి



పెద్ద కటిక వీధిలో మౌలాలి పీరు ఊరేగింపు

మద్దికెర: హిందూ ముస్లింలు మతాలకతీతంగా వైభవంగా జరుపుకునే మొహర్రం వేడుకలు ముగిసిన మూడో రోజు నిర్వహించే జాల్దార్ పున్నమి వేడుకలు సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండలంలోని మద్దికెర, పెర వలి, ఎం.అగ్రహారం, హంప తదితర గ్రామా లలో ఉదయం ఆయా పీర్ల చావిళ్లను అలంకరించి గ్రామాల్లోని హిందూ ముస్లింలు స్వామి వార్లకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పూజలకు విచ్చేసిన భక్తులకు అన్నదానం చేశారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని ప్రార్థనలు చేశారు.


లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటుచేయాలి

వెల్దుర్తి: హంద్రీ–నీవా కాలువ ద్వారా వెళ్తున్న నీటిని మల్లెపల్లె పీఎస్–3, చెరుకులపాడు మధ్యలో లిఫ్ట్ ఇరిగేషన్ (ఎత్తిపోతల పథకం ద్వారా) ఏర్పాటు చేసి వెల్దుర్తి మండలానికి తరలించాలని సీపీఐ మండల కార్యదర్శి టి.కృష్ణ డిమాండ్ చేశారు. తద్వారా మండల పరిధిలోని అన్ని చెరువులకు నీటిని నింపడంతో పాటు, ఆయకట్టు పొలాలు సస్యశ్యామలం అవుతాయని, పేద రైతుల జీవన స్థితులు మెరుగవుతాయన్నారు. సమావేశంలో బాలరాజు, మాధవకృష్ణ, రాజు, ఖాసిం పాల్గొన్నారు.

పార్టీ అభివృద్ధికి కృషి

ఆస్పరి: మండలంలో వైఎస్సార్‌సీపీ పార్టీ అభివృద్ధికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ మండల కన్వీనర్ పెద్దయ్య అన్నారు. సోమవారం ఐనకల్లు గ్రామంలో వైఎస్సార్‌సీపీ జెండాను కన్వీనర్ ఆవిష్కరించి కేక్‌ను కట్ చేశారు. కన్వీనర్, మండల సొసైటీ చైర్మన్ కట్టెల గోవర్ధన మాట్లాడారు. నాయకులు హనుమంత రెడ్డి, గోవిందు, గురప్ప, గోవిందరాజులు, రంగస్వామి, శేషప్ప తదితరులు పాల్గొన్నారు.

కారు అదుపుతప్పి ఒకరికి తీవ్రగాయాలు



కారులో స్టీరింగ్ వద్ద ఇరుక్కుపోయిన సుధీర్

వెల్దుర్తి: కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో ప్యాపిలి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ ఉద్యోగి (ఆఫీస్ సబార్డినేట్) సుధీర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. విధి నిర్వహణలో ఉన్న సుధీర్ అవసర నిమిత్తం సోమవారం మధ్యాహ్నం అధికారి అనుమతి తీసుకుని కర్నూలుకు కారులో బయలుదేరాడు. వెల్దుర్తి సమీపంలో విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద కారు అదుపుతప్పింది. డివైడర్‌ను ఢీకొని టైరు పగిలి పల్టీలు కొట్టుకుంటూ వెళ్లి రోడ్డు పక్కన పడింది. ప్రమాదంలో సుధీర్ తలకు తీవ్రగాయాలై స్టీరింగ్ వద్ద ఇరుక్కుపోయాడు. హైవే పోలీసుల ద్వారా సమాచారం అందుకున్న వెల్దుర్తి సీఐ యుగంధర్, ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి, పోలీసులు సంఘటనాస్థలికి చేరుకుని స్టీరింగ్ వద్ద ఇరుక్కున్న సుధీర్‌ను స్థానికుల సహాయంతో బయటకు తీశారు. తలకు తీవ్రగాయాలైన సుధీర్‌ను 108 వాహనంలో కర్నూలు ఆసుపత్రికి తరలించారు.

జగనన్న సురక్షతో సంక్షేమ విప్లవం

- ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఉన్నచోటనే ఉచితంగా సర్టిఫికెట్ల మంజూరు
- జగనన్న పాలనకు తిరుగులేదు
- పచ్చ నేతలు మాయ మాటలు ప్రజలు నమ్మరు
- మంత్రి గుమ్మనూరు జయరాం



గుమ్మనూరు గ్రామంలో శివాలయం నిర్మాణానికి రూ.5 లక్షలు విరాళం అందిస్తున్న మంత్రి జయరాం



మంత్రి గుమ్మనూరు జయరాం సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులు

ఆలూరు: ప్రజలు వ్యయ ప్రయాసాలకు గురికాకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందేందుకు అవసరమైన 11 రకాల సర్టిఫికెట్లను ఉచితంగా అందించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించి, రాష్ట్రవ్యాప్తంగా సుమారు కోటికిపైగా ధ్రువపత్రాలు మంజూరు చేశారని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. చిప్పగిరి మండలం మంత్రి స్వగ్రామమైన గుమ్మనూరులో శివాలయం నిర్మాణానికి గ్రామస్తులు, ఆలయ కమిటీ నిర్వాహకులు అడిగిన వెంటనే రూ.5 లక్షల విరాళాన్ని ఆదివారం రాత్రి అందజేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి ప్రకటన విడుదల చేశారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతి గ్రామ సచివాలయంలో ప్రజలు, కార్మికులు, రైతులు, యువత దరఖాస్తు చేసుకున్న వెంటనే సంబంధిత అధికారులు 11 రకాల ధ్రువపత్రాలు మంజూరు చేయడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాలనను ప్రజలకు చేరువ చేసి, గ్రామ స్వరాజ్య స్థాపనే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నట్లు వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా 15,002 గ్రామ సచివాలయలలో ప్రత్యేక క్యాంపులను నిర్వహించి 1.38 కోట్ల కుటుంబాలను సర్వేచేసి 40.52 లక్షల మందికి కుల ధ్రువీకరణ 38.52 లక్షల మందికి ఆదాయ సర్టిఫికెట్లను మంజూరు చేసినట్లు తెలిపారు. ఇంతగా ప్రజలకు సేవలందిస్తూ సుపరిపాలన సాగిస్తున్నా ఎల్లో మీడియాకు కనబడదని, ప్రభుత్వంపై బురదచల్లడమే ప్రతిపక్ష నాయకులు లక్ష్యంగా పెట్టుకున్నారని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు నారాయణ, శ్రీనివాసులు, లక్ష్మీదేవి, విక్రాంత్‌రెడ్డి, శివాలయం కమిటీ పెద్దలు, తదితరులు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక

ఆలూరు: వెనుకబడిన వర్గాల వారికి రాజకీయాలలో సముచిత స్థానం కల్పించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే అని కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. స్థానిక మంత్రి నివాసంలో సోమవారం రాత్రి 7.50 గంటలకు హాలహర్వి మండలం గూళ్యం గ్రామానికి చెందిన టీడీపీ మద్దతుదారులు రంగనాథ్, చితానందప్ప, ఉలిగప్ప, విరుపాక్షిప్ప, గిడ్డి బసప్ప తదితర 50 కుటుంబాల వారు ఆ పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి మంత్రి జయరాం పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. మంత్రి మాట్లాడుతూ.. అట్టడుగు వర్గాల అభ్యున్నతికి వైఎస్సార్‌సీపీ నిరంతరం కృషి చేస్తోందన్నారు. రానున్న ఎన్నికల్లో కష్టపడి చేసి పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలో చేరినట్లు నాయకులు ప్రకటించారు. రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ బజారప్ప, నాయకులు లింగమల్లప్ప, పెద్ద లింగ, హోబన్న, సోమన్న తదితరులు ఉన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



ఎమ్మిగనూరులో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఉదయం మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, వార్డు కౌన్సిలర్ డిష్ కేశవరెడ్డిలతో కలిసి పట్టణంలోని 22వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వార్డులో ఇంటింటికీ వెళ్లి ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించి బుక్‌లెట్‌లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల ద్వారా అర్హులైన ప్రతిఒక్కరికీ ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. సంక్షేమ పథకాల అమల్లో అవినీతికి తావులేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాలోకే జమ చేస్తున్నారన్నారు. పట్టణంలో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి తగిన ప్రణాళికతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. వార్డులోని కొన్ని ప్రాంతాల్లో డ్రైన్ల సమస్యలను స్థానికులు ఆయన దృష్టికి తీసుకురాగా సత్వరం పరిష్కరించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ డీఈలు మనోహర్ రెడ్డి, నీరజ, వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, జిల్లా వక్ఫ్ బోర్డు ఉపాధ్యక్షుడు రియాజ్‌అహమ్మద్, వైఎస్సార్‌సీపీ నాయకులు యూకే వీరేంద్ర, సునీల్ కుమార్, అమాన్, నరసింహులు, సయ్యద్‌చాంద్, సోమేష్, బజారి, రంగ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని కోటేకల్ గ్రామంలో సోమవారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించడంతో పాటు స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఎంపీపీ గొల్ల కేశన్న, సర్పంచ్ జాలవాడి లక్ష్మి, ఎంపీటీసీ నరసింహులు, నాయకులు జాలవాడి లక్ష్మన్న, శ్రీను, తిక్కన్న, తాయన్న, పెద్దయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి



జొహరాపురంలో ఎంపీపీ స్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న డాక్టర్ విజయభారతి

నందవరం: రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో 'జగనన్న గోరుముద్ద' పథకం అమలు చేస్తోందని 104 డాక్టర్ విజయ భారతి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని జొహరాపురం గ్రామంలో 104 ద్వారా గ్రామస్తులు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని ఎంపీపీ స్కూల్‌లో మధ్యాహ్న భోజనం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని వంట ఏజెన్సీ సభ్యులకు సూచించారు. అలాగే వర్షాలు కురవడంతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. పిల్లలకు కళ్ల కలక వైరస్ వ్యాప్తి చెందుతోందని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డేటా ఆపరేటర్ చిట్టెమ్మ, ఏఎన్ఎం పుష్పావతి, హెల్త్ అసిస్టెంట్ ఆనందరాజు, హెచ్ఎం గోకారి, అంగన్‌వాడీ కార్యకర్త హేమలత, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నాడు–నేడు పనులు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న ఎస్ఎస్ఏ ఏఈ మురళి

తుగ్గలి: నాడు–నేడు పథకం కింద ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన పనులను ఆగస్టు నెలాఖరుకంతా పూర్తి చేయాలని ఎస్ఎస్ఏ మండల ఏఈ మురళి ఆదేశించారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం నాడు–నేడు పనులపై హెచ్ఎంలతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం రెండో విడత కింద మండలంలో 38 పాఠశాలల్లో రూ.14.49 కోట్లతో పనులు చేపట్టగా ఇప్పటివరకు చేసిన పనులకు రూ.4.49 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. ఆగస్టు నెలఖారులోగా పనులన్నీ పూర్తి చేయాలన్నారు. ఎక్కడైనా పాఠశాల గదులు శిథిలావస్థకు చేరి ఉంటే అప్రమత్తంగా ఉండాలన్నారు. వెంటనే సమస్యలున్న పాఠశాలల వివరాలను తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం ఎంఈఓ–2 రామవెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఫార్మేటివ్–1 పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రభుత్వం అందించిన ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ డిస్‌ప్లేలను వినియోగించుకుంటూ విద్యార్థులకు బోధన చేయాలన్నారు.

ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్‌కు చర్యలు

మద్దికెర: ప్రజాసేవ చేసేందుకు స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ సహకారం ఎంతో అవసరమని, ఈ నెల 2వ తేదీ నుంచి ఇళ్ల స్థలాలను పేదలకు రిజిస్ట్రేషన్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని శాలివాహన సంఘం కార్పొరేషన్ మాజీ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర, తుగ్గలి మాజీ జెడ్పీటీసీ వరలక్ష్మి అన్నారు. సోమవారం మండల పరిధిలోని పెరవలి గ్రామంలో ఓ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. తుగ్గలిలో తమ సొంత స్థలంలో 670 మంది పేదలకు ఇంటిపట్టాలు గతేడాది జనవరిలో మంజూరు చేశారని, ప్రభుత్వ ఆశయం మేరకు స్థలాలను రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇప్పటికే తుగ్గలిలో ప్రభుత్వ కార్యాలయాలన్నింటికీ స్థలాలు ఇవ్వడం జరిగిందన్నారు. ప్రభుత్వం రిజిస్ట్రేషన్ ఫీజులో సబ్సిడీ ఇచ్చి పేద ప్రజలను ఆదుకోవాలన్నారు.

రోడ్డు పనులు చేపట్టాలి

హొళగుంద: అధ్వానంగా ఉన్న ఢణాపురం–హొళగుంద, మార్లమడికి రోడ్డులో వెంటనే పనులు చేపట్టి బస్సుల రాకపోకలు పూర్తిస్థాయిలో జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో హొళగుంద బస్టాండులో సామూహిక దీక్షలు చేపట్టా రు. సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, నాయకు లు పెద్యాట మారెప్ప, రంగన్న పాల్గొన్నారు.

కొత్తపేటలో స్పెయిన్ బృందం సందడి



మాట్లాడుతున్న డైరెక్టర్ రాజశేఖర్ రెడ్డి

దేవనకొండ: మండలంలోని కొత్తపేట గ్రామంలో సోమవారం స్పానిస్ బృందం పర్యటించింది. గతంలో ఆర్డీటీ స్వచ్ఛంద సంస్థ నిర్మించిన 30 ఇళ్లను ఆ బృందం ప్రతినిధులు ప్రారంభించారు. ఏర్పాటు చేసిన సభలో లబ్ధిదారులను ఉద్దేశించి మాట్లాడారు. ఆర్డీటీ స్వచ్ఛంద సంస్థ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆర్డీటీ వ్యవస్థాపకులు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సంస్థ తరపున అనేక సేవా కార్యక్రమాలను చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. ఆర్డీటీ సంస్థ ఏటీఎల్ రెహాన్, డైరెక్టర్ రాజశేఖర్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

పత్తిలో ఎర్రతెగులు నివారించాలి



పత్తి పంటను పరిశీలిస్తున్న ఏఓ సురేష్‌బాబు

దేవనకొండ: పత్తి పంటకు సోకిన ఎర్రతెగులు నివారణకు రైతులు చర్యలు తీసుకోవాలని ఏఓ సురేష్‌బాబు సూచించారు. ఈ మేరకు సోమవారం దేవనకొండతో పాటు ఆయా గ్రామాల్లో సాగుచేసిన పత్తి పంటను ఆయన పరిశీలించారు. ఎర్ర తెగులు ఉధృతిని గమనించి నివారించేందుకు రైతులకు సూచనలు చేశారు. మండలంలో దాదాపు 33 వేల ఎకరాల్లో రైతులు పత్తి సాగుచేశారన్నారు. పంటకు సోకిన ఎర్రతెగులు నివారణకు 19–19–19 లేదా 14–0–35 ఐదు గ్రాములు ఒక లీటర్ నీటిలో కలుపుకొని మొక్కలు బాగా తడిచేలా పిచికారీ చేసుకోవాలన్నారు. అలాగే క్లోరోతాలిన్ 75 శాతం కవా ఒక గ్రాము లేదా ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. మళ్లీ ఐదు రోజుల తర్వాత ఫార్ములేషన్ నాలుగు లేదా ఆరు, ఐదు గ్రాములు ఒక లీటర్ నీటికి కలుపుకొని పిచికారీ చేసుకోవాలన్నారు. వడలు తెగులు నివారణకు కాపర్ ఆక్సిక్లోరైడ్ (బ్లైటాక్స్) మూడు గ్రాములు ఒక లీటర్ నీటిలో కలుపుకొని మొక్కల మొదళ్ల వద్ద వేసుకోవాలన్నారు. వ్యవసాయ సిబ్బంది రైతులకు అందుబాటులో ఉంటారని, వారి సలహాలు, సూచనలు పాటించాలన్నారు. ఏఈఓ యోగేంద్ర, రైతులు వెంట ఉన్నారు.

బిల్లేకల్లు మార్కెట్‌కు రికార్డు ధర



బిల్లేకల్లులో వేలం నిర్వహిస్తున్న పత్తికొండ డీఎల్‌పీఓ ప్రకాష్‌నాయుడు

ఆస్పరి: మండలంలోని బిల్లేకల్లులోని పంచాయతీ కార్యాలయం ఆవరణలో 2023–24 సంవత్సరానికి సంబంధించి సోమవారం సర్పంచ్ శ్రీను, పత్తికొండ డీఎల్‌పీఓ ప్రకాష్‌నాయుడు, ఈఓఆర్డీ సూర్యనరసింహారెడ్డి నిర్వహించిన దినసరి కూరగాయల మార్కెట్ వేలం రికార్డు స్థాయిలో రూ. 58.50 లక్షలు పలికింది. ఏడాది కాలానికి మార్కెట్ వేలం ద్వారా పంచాయతీకి ఇంత భారీ మొత్తం లభించడం డివిజన్ స్థాయిలో ఇదే మొదటిసారి. వేలంలో 8 మంది పాటదారులు రూ.లక్ష డిపాజిట్ చెల్లించి పాల్గొన్నారు. వేలం పోటాపోటీగా జరగ్గా చివరకు గిత్త నల్లన్న అనే వ్యక్తి రూ.58.50 లక్షలకు వేలం పాడి హక్కులను దక్కించుకున్నారు. గతేడాది మార్కెట్ వేలం రూ.54.38 లక్షలు పలకగా ఈసారి రూ.4.12 లక్షలు ఆదాయం పెరిగింది. పంచాయతీ కార్యదర్శి లక్ష్మన్న, గ్రామ పెద్దలు పెద్దయ్య, హనుమంతరెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సిబ్బందికి యూనిఫాంలు



వెల్దుర్తిలో యూనిఫాంలు పంపిణీచేస్తున్న సీడీపీఓ, సూపర్‌వైజర్లు

వెల్దుర్తి: వెల్దుర్తి, కృష్ణగిరి మండలాలకు చెందిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు 218 మందికి సోమవారం 2 జతల యూనిఫాంలను వెల్దుర్తి సెక్టార్ సీడీపీఓ ల్యూక్, రెండు మండలాల సెక్టార్ల సూపర్‌వైజర్లు సునీత, సరస్వతి, శ్రీదేవిలతో కలిసి అందించారు. యూనిఫాం క్లాత్ గతం కంటే నాణ్యతగా ఉందని కార్యకర్తలు, ఆయాలు కితాబునిచ్చారు. స్థానిక బాలుర హాస్టల్ ఆవరణలో నిర్వహించిన సెక్టార్ సమావేశంలో సీడీపీఓ మాట్లాడుతూ.. ఆగస్టు 2నుంచి బాలింతలు, గర్భిణులకు ఇంటి వద్దకే పోషకాహారం అందించనున్నట్లు, ఈ మేరకు కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అదే రోజున ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు పోషకాహారాన్ని వండి అంగన్‌వాడీ కేంద్రాల వద్దే అందించగా అక్కడే భుజించాల్సి వచ్చేదని, ఫలితంగా పలువురు రాలేని పరిస్థితులలో పోషకాహారం సరిగా అందేది కాదన్నారు. ఇకపై బాలింతలు, గర్భిణులకు ఇంటి వద్దకే నెలకు సరిపడా పోషకాహారంలో భాగంగా వైఎస్సార్ పోషణ కిట్ (2 కేజీల రాగిపిండి, 1 కేజీ అటుకులు, పావు కేజీ చిక్కి, తదితరాలు), బియ్యం, బ్యాళ్లు, నూనెతో పాటు గ్రుడ్లు, పాల ప్యాకెట్లు అందించనున్నట్లు తెలిపారు. ఆయా సామగ్రి ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి, కాంట్రాక్టర్ల నుంచి అంగన్‌వాడీ కేంద్రాలకు చేరిందా లేదా అని పరిశీలిస్తున్నట్లు చెప్పారు.

న్యాయవాదుల రక్షణ చట్టం అమలుచేయాలి



ఆర్డీఓ మోహన్‌దాసుకు వినతిపత్రం ఇస్తున్న న్యాయవాదులు

పత్తికొండటౌన్: రాజస్థాన్ రాష్ట్రంలో మాదిరిగా దేశ వ్యాప్తంగా న్యాయవాదుల రక్షణ చట్టం బిల్లును పార్లమెంటులో ఆమోదించి, అన్ని రాష్ట్రాల్లో అమలు చేయాలని బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి బి.రంగస్వామి, సీనియర్ న్యాయవాదులు ఎల్లారెడ్డి, మైరాముడు డిమాండ్ చేశారు. విజయవాడ బార్‌అసోసియేషన్ న్యాయవాది విఠల్‌బాబు దారుణ హత్యను ఖండిస్తూ రాష్ట్ర బార్‌అసోసియేషన్ పిలుపు మేరకు సోమవారం పత్తికొండలో న్యాయవాదులు విధులు బహిష్కరించారు. అనంతరం ర్యాలీగా వెళ్లి ఆర్డీఓ మోహన్‌దాసుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వివిధ కేసులలో ప్రజల పక్షాన కోర్టులలో వాదించే న్యాయవాదులకు రక్షణ లేకుండా పోవడం బాధాకరం అన్నారు. న్యాయవాదుల రక్షణ కోసం ప్రత్యేక చట్టం తీసుకురావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. న్యాయవాదులపై దాడులకు పాల్పడే వారిపై కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. న్యాయవాదుల రక్షణ చట్టం అమలు కోసం దేశవ్యాప్తంగా సంఘటితంగా పోరాడతామన్నారు. న్యాయవాదులు బద్రీనారాయణ, వెంకట్రాముడు, మల్లికార్జున, మహేష్, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

ఆలూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 4వ తేదీన నిర్వహించనున్న జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వృత్తి నైపుణ్యాభివృద్ధి అధికారి వి.శ్రీకాంత రెడ్డి సూచించారు. ప్రముఖ కంపెనీలకు చెందిన ప్రతినిధులు అభ్యర్థులను పరీక్షించి ఉద్యోగాలకు ఎంపిక చేసుకుంటారని వెల్లడించారు. కార్యక్రమాన్ని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం చేతులమీదుగా ప్రారంభించనున్నట్లు తెలిపారు.

ఆర్డీఎస్ కాలువ పూర్తిచేయాలి

గోనెగండ్ల: దశాబ్దకాలంగా పెండింగ్‌లో ఉన్న ఆర్డీఎస్ కుడి కాలువ నిర్మాణాన్ని పూర్తిచేసి 40 వేల ఎకరాలకు సాగునీరు అందించి మంత్రాలయం, ఎమ్మిగనూరు నియోజకవర్గాలలో వలసలు నివారించాలని సీపీఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు పంపన్న గౌడ్, రంగన్న, మండల కార్యదర్శి నాగప్ప డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం గోనెగండ్ల బస్టాండ్ సమీపంలో సంతకాల సేకరణ చేపట్టారు. సీపీఐ నాయకులు జయరాం, షాలు, సుధాకర్, గిడ్డయ్య, పాండు, వీరేష్, బజారి పాల్గొన్నారు.

ఆర్బీకేల్లో అందుబాటులో ఎరువులు

మద్దికెర: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో మండలంలోని రైతులకు అవసరమయ్యే ఎరువులను ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలలో అందుబాటులో ఉంచినట్లు జరిగిందని ఏఓ రవి సోమవారం తెలిపారు. మద్దికెర, హంప, పెరవలి గ్రామాలలో కోరమాండల్ 20–20–0–13, కోరమాండల్ డీఏపీ, సేరిక్ ఎస్ఎఫ్‌సీఎల్ ఎం.అగ్రహారంలో కోరమాండల్ డీఏపీ అందుబాటులో ఉంచామని, ఎరువులు కావలసిన రైతులు ఆర్బీకేలలో వ్యవసాయాధికారులను సంప్రదించాలన్నారు.

రైతు ఆత్మహత్య



మృతిచెందిన రవికుమార్

పత్తికొండటౌన్: పత్తికొండ పట్టణం చింత కాయల వీధికి చెందిన దేవగట్టు రవికుమార్ అనే రైతు సోమవారం ఉదయం పురుగు మందు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాలు.. రవికుమార్ 6 ఎకరాల పొలం సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గత రెండేళ్లుగా పంటల సాగు కోసం రూ.4 లక్షలు అప్పు చేశాడు. అప్పుల భారం అధికం కావడంతో ఉదయం పొలానికి వెళ్లి పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నారు.

అర్హులందరికీ కౌలు కార్డులు

ఆలూరు రూరల్: మండలంలో అర్హులైన 323 మందికి కౌలు రైతు కార్డులు జారీ చేసినట్లు అగ్రికల్చర్ అధికారి వెంకటేశ్వర గౌడ్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 16 ఆర్బీకేల పరిధిలో అగ్రికలచ్చర్ అసిస్టెంట్ల ద్వారా కౌలు రైతులను గుర్తించామన్నారు. సోమవారం నాటికి కార్డుల ప్రక్రియ పూర్తయ్యిందన్నారు. కౌలు కార్డు పొందిన రైతులు రాష్ట్ర ప్రభుత్వం అందించే రైతు భరోసా, పంట నష్ట పరిహారంతో పాటు సబ్సిడీ విత్తనాలు, ఎరువులు పొందవచ్చన్నారు. ఇటీవల కురిసిన వర్షాల వల్ల పత్తి పంటకు సోకిన ఎర్రతెగులు నివారణకు ఆయా గ్రామాల్లోని అగ్రికల్చర్ అసిస్టెంట్ల సలహాలు పాటించి పురుగు మందులు పిచికారీ చేయాలన్నారు.

రుణాలను రెన్యూవల్ చేసుకోండి

ఆలూరు: స్థానిక ఏపీజీబీలో 2021–22 ఖరీఫ్ సీజన్లలో పంటల సాగుకు రుణాలు పొందిన రైతులు వాటిని రెన్యూవల్ చేసుకోవాలని సీనియర్ మేనేజర్ బి.మంజూనాథ్ సూచించారు. ఆయన సోమ వారం బ్యాంకులో మాట్లాడుతూ.. బ్యాంకు పరిధి లో 12 గ్రామాలకు చెందిన రైతులు దాదాపు 3,500 మంది పంట రుణాలను పొందారన్నారు. అయితే ఇప్పటి వరకు 400 మంది వరకు మాత్రమే రుణాలను రెన్యూవల్ చేసుకున్నట్లు తెలిపారు. రైతులు రుణాలను రెన్యూవల్ చేసుకోవాలని సూచించారు. అలాగే అర్హత కలిగిన రైతులకు కొత్తగా రుణాలను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు.

అరుణాచలం బస్సు సర్వీసు ప్రారంభం

ఎమ్మిగనూరుటౌన్: పౌర్ణమి పురస్కరించుకుని భక్తుల కోసం స్థానిక ఆర్టీసీ డిపో నుంచి తమిళనాడు రాష్ట్రం అరుణాచలంకు సూపర్ లగ్జరీ బస్సు సర్వీసును (ఏపీ 21 జెడ్ 0662) సోమవారం రాత్రి 8.30 గంటలకు డిపో మేనేజర్ అమర్నాథ్ ప్రారంభించారు. బస్సు యాత్రలో కాణిపాకం వినాయకుడు, గోల్డెన్ టెంపుల్‌లో అమ్మవారి దర్శనం, అరుణాచలంలో గిరి ప్రదక్షిణ చేయించి తిరుగు ప్రయాణం ఉంటుందన్నారు.

నేడు పింఛన్ల పంపిణీ

తుగ్గలి: మండల వ్యాప్తంగా మంగళవారం నుంచి వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ సావిత్రి తెలిపారు. మండలంలోని 18 సచివాలయ పరిధిలో 7,540 పింఛన్‌దారులకు పంపిణీ చేసేందుకు రూ.2,08,52,500 నగదు మంజూరైందన్నారు. వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్ సొమ్ము అందజేస్తారన్నారు.

బండరాళ్ల మధ్య ఇరుక్కున్న కాపరి

తుగ్గలి: మేకలు మేపేందుకు వెళ్లిన ఓ కాపరి బండరాళ్ల మధ్య ఇరుక్కుపోయిన సంఘటన తుగ్గలి మండలం చెన్నంపల్లిలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన శవాసప్ప కుమారుడు రాజేష్ మేకలు మేపేందుకు కోటలోకి వెళ్లాడు. అక్కడ పెద్ద బండరాళ్లు దాటే ప్రయత్నంలో జారి మధ్యలో పడిపోయాడు. రాళ్ల మధ్య ఇరుక్కుపోయిన రాజేష్ సెల్‌ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వడంతో గ్రామస్తులు వెళ్లి తాళ్ల సాయంతో సురక్షితంగా బయటకు లాగారు.

రీసర్వేతో వివాదాల పరిష్కారం

దేవనకొండ: రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు భూరక్ష కార్యక్రమాన్ని తెర్నేకల్ గ్రామంలో సర్పంచ్ మొగతాల్ అరుణ్‌కుమార్ సోమవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. భూముల సమగ్ర సర్వే ద్వారా ఏళ్ల తరబడి ఉన్న వివాదాలు పరిష్కారమవుతాయన్నారు. సర్వేకు రైతులు సహకరించాలని కోరారు. స్థానిక నాయకులు ఈరన్న, నామాల శ్రీను, మధుసూదన్‌రెడ్డి, రాఘవేంద్ర, వీఆర్వో మునీర్‌బాషా, సర్వేయర్లు సునీత, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్‌లో హింసను అరికట్టాలి



గోనెగండ్లలో ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు, ముస్లింలు

గోనెగండ్ల: మణిపూర్ రాష్ట్రంలో కుకీ నాగ తెగలకు చెందిన మహిళలను నగ్నంగా ఊరేగించిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఆయా సంఘాల నాయకులు దేవసహాయం, ప్రసంగి, హైమవతి, ఎస్ఎన్.మాబువలి, ఉస్మాన్‌లు డిమాండ్ చేశారు. దళితుల ఐక్య క్రైస్తవ సంఘం ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రం గోనెగండ్లలో క్రైస్తవులు శాంతియూత ర్యాలీ చేపట్టారు. ర్యాలీకి ముస్లిం మైనార్టీ సంఘాలు, ప్రజా సంఘాలు మద్దతు తెలిపాయి. క్రీస్తుసంఘం చర్చి నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ వేణుగోపాల్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగేష్‌కు వినతిపత్రం అందజేశారు.